క్లుప్తంగా

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానవపాడు: కృష్ణానదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఆర్ఐ గురురాజ్ సూచించారు. సోమవారం మండలంలోని పల్లెపాడు, చండూరు నదీతీర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణానదీ తీర ప్రాంతాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట పొలాల్లోకి నీరు వచ్చినా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

బెదిరింపులు మానుకోవాలి

అలంపూర్: వాస్తవాలను విశ్లేషించే వారిపై బెదిరింపులు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక విశ్లేషకులు మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ వాస్తవాలను వివరించడంతో బీజేపీ సీనియర్ నాయకులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అనుచరులు బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వరుసగా ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు లు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేటీదొడ్డి ఎస్ఐ బదిలీ

కేటీదొడ్డి: ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావును జిల్లా పోలీస్ కార్యాలయం డీసీఆర్బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో డీసీఆర్బీలో ఉన్న బీ శ్రీనివాసులును కేటీదొడ్డి ఎస్ఐగా బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం సెలవు కావడంతో మధ్యాహ్నం విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హాస్టల్ వార్డెన్ నర్సింహులు తెలిపారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

శ్రీహరి మాస్టర్‌కు సన్మానం



ధరూరు: ఇంటర్నేషనల్ కోర్సు బ్లాక్ బెల్ట్ బూమ్డాన్ అవార్డు పొందిన తెలంగాణ రాష్ట్ర తైక్వాండో బోర్డు జనరల్ సెక్రటరీ శ్రీహరి మాస్టర్‌ను సోమవారం మండల కోచ్ రసీద్ సన్మానించారు. ఇటీవల ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ కోర్స్ బ్లాక్‌బెల్ట్ పర్ఫామెన్స్‌లో అవార్డు రావడం సంతోషకరమన్నారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో విద్యార్థులు గాయత్రి, రషి గౌడ్, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



అయిజ: ప్రైవేటు పాఠశాలల యాజయాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహ అన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. అయినా మండల కేంద్రంలో సోమవారం కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తెరిచి, విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంఈఓ ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలను నిర్వహించిన వారికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా విద్యాధికారులకు నివేదికను పంపుతామని ఆయన తెలిపారు.

గ్రామాల్లోని ఓటర్లే కీలకం



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరులను క్షుణ్ణంగా పరిశీలించాలని డీపీఓ శ్యాంసుందర్ ఎంపీడీఓ తిరుపతన్నకు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో కార్యదర్శులు నమోదు చేస్తున్న ఓటరు జాబితాను డీపీఓ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 6లోపు ఓటరు జాబితా పూర్తి చేయాలని డీపీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

అయిజ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్‌డీ డీఓ సరోజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీ డీఓ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ కృష్ణ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

ధరూరు: శ్రావణ మాసం ముగింపు, అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి, అల్వాలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దచింతరేవుల, ధరూరు ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు, మండల కేంద్రంలోని ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు శివునికి అభిషేకం నిర్వహించారు. డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీ పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల భక్తులు దాసంగాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



బీచుపల్లిలో..

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు, ప్రజలు కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి జలాభిషేకం చేశారు. పాడి పంటలు బాగుండాలని, అధిక దిగుబడి రావాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: అమావాస్య పర్వదినం పురస్కరించుకుని గోమాతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గో ప్రచారక్ సేవాసమితి ఆధ్వర్యంలో గోమాతను పట్టు వస్త్రాలతో అలంకరించి పశుగ్రాసం, పండ్లు, ఫలహారాలు సమర్పించారు. కార్యక్రమంలో గాయత్రి శ్రీనివాసులు, రామచంద్రుడు, కృష్ణుడు, వెంకట్రాముడు, వెంకటేష్, శాంత, సుభాషిని, ధనలక్ష్మి, భవాని, స్వీటి పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలో ఆంజనేయస్వామికి ఆకుపూజలు, ప్రత్యేక అర్చన నిర్వహించారు. అమరవాయిలో భీమోజీరావు, రామోజీరావు దంపతు లు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నందికోలసేవ

గట్టు: శ్రావణ మాసం చివరి సోమవారం రోజున వీరశైవలింగాయత్ సంఘం వారు మండల కేంద్రంలో ఘనంగా నందికోల సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా గ్రామంలోని బంగారు బసవేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వీరశైవలింగాయత్ భక్తులు ఊర చెరువు దగ్గరున్న కట్ట రామలింగేశ్వర దేవాలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే నందికోల సేవ ఆడించారు. అనంతరం గ్రామంలోని బంగారు బసవేశ్వర దేవాలయం వరకు నందికోలసేవను ఆడిస్తూ ఊరేగించారు. ఆరగిద్దలోని నందికోల సేవ భక్త శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో క్యూలో వెళ్తున్న భక్తులు

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ కొత్త, పాత వాహనాలకు పూజలు చేయించారు. ఆయా ఆలయాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, వాల్మీకి పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



ధరూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధరూరు: మండలంలో వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ మండల నాయకులు డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ హయాంలో మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారన్నారు. తద్వారా ఎడారి లాంటి నడిగడ్డ ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం మన ధర్మమన్నారు. ఈ ప్రాంత రైతులంతా వైఎస్సార్‌కు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ మోహన్‌రావు, వైఎస్సార్ అభిమానులు డీఆర్ శ్రీహర్ష, వెంకట్రాములు, హనుమంతు, మహదేవులు, గోసి గోవిందు, కిష్టన్న, ఎంటికల ఈదన్న, దేవన్న, గుండన్న, లాజర్, టైలర్ తిమ్మప్ప, సురేష్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ సర్కిల్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో పథకాలతో పేదలకు అండగా నిలిచిన మరుపురాని నేత వైఎస్సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, రవి, చాంద్ బాషా, శ్రీరాములు, కృష్ణ గౌడు, రసూల్ మియ్యా, తిక్కన పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఎర్రవల్లి కూడలిలో వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రుక్మాందర్‌రెడ్డి, మద్దిలేటి, పెద్ద లక్ష్మన్న, రాజ్‌కుమార్, ఉమాపతి నాయుడు, ఆదాం, యువరాజ్, సంధ్యబాబు, కార్యకర్తలు ఉన్నారు.



ఉండవెల్లిలో..



ఎర్రవల్లిలో..

విద్యుదాఘాతంతో ఎద్దు, మేక మృత్యువాత

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కాడెద్దు, ఒక మేక మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దాటికి దౌదర్‌పల్లి కాలనీలో విద్యుదాఘాతం ఏర్పడింది. దీంతో చాకలి రాముడుకు సంబంధించిన కాడెద్దు, కుర్వ జగదీష్‌కు చెందిన మేక మృత్యువాతపడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం నుంచి ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు.

పలు దుకాణాల్లో చోరీ

గద్వాల క్రైం: గద్వాల పట్టణంలోని పలు దుకాణాల్లో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. క్రిష్ణవేణి చౌరస్తాలోని వెలసిన మొబైల్ షాపు, కంప్యూటర్ షాపు, పాన్ షాపుల్లో గుర్తు తెలియని దుండగులు షాప్ షెట్టర్లను తొలగించి అందులో ఉన్న నగదును అపహరించారు. అయితే ఈ చోరీలో దాదాపు రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి చోరీ సంఘటనలపై ఆరా తీశారు. దుకాణాల్లో ఎలాంటి వస్తువులు అపహరణకు గురి కాలేదని బాధితులు ఎస్ఐకు వివరించారు. దుకాణదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలుషిత నీటితో ప్రబలుతున్న వ్యాధులు



రాజోళి: శుద్ధి చేయకుండా నీటిని వదలుతుండటంతో కొత్త రాజోళిలో వ్యాధులు ప్రబలుతున్నాయని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త రాజోళి, ఆర్‌డీటీ కాలనీలో కొళాయి ద్వారా తుంగభద్ర నది నీరు అందిస్తున్నారని, మూడు రోజులుగా నీరు అపరిశుభ్రంగా, మడ్డి, మలినాలతో వస్తున్నాయన్నారు. దీంతో చిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు అయ్యి తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికే పలువురు అనారోగ్యం పాలయ్యారన్నారు. శుద్ధి చేసిన నీటిని వదలాలని ఎంపీడీఓకు విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్, లబ్బరి తిక్కన్న, ఆటో జయన్న, ఎల్లప్ప స్థానికులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా, అలంపూర్ వెళ్లే మార్గంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సోమవారం అలంపూర్ చౌరస్తా సమీపంలో రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులు, ఏడుగురిపై బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన కేసులు నమోదయ్యాయి. వాహనాల తనిఖీలో 20 మందిపై రూ.5025 చలాన్లు వేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వర్షాలకు కూలిన మట్టి ఇళ్లు

కేటీదొడ్డి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అతలాకుతలమైంది. రోజువారి కూలీ పనులు చేసే వాళ్లకు పనుల్లేక అవస్థలు పడుతున్నారు. వర్షాలకు ఇళ్ల నుంచి బయటకు ఎవరూ రాకూడదని అధికారులు చెబుతున్నారు. మండలంలోని గంగన్పల్లిలో కృష్ణకు చెందిన మట్టి మిద్దె పూర్తిగా కూలిపోయింది. భాగ్యమ్మ ఇళ్లు వాట్లు పూర్తిగా విరిగి మట్టి కూలింది. ప్రభుత్వ సహాయం అందజేయాలని డీటీ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

గట్టు: వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో 4 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు అధికారులు గుర్తించారు. ముసురు వర్షం కారణంగా మట్టి మిద్దెలు కూలిపోతుండగా, మరి కొన్ని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఇళ్లలో ఎవరు లేని సమయంలో 4 ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లుగా అధికారులు గుర్తించారు. గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, సల్కాపురం గ్రామాల్లో ఒక్కొక్క ఇళ్లు పాక్షికంగా కూలినట్లుగా రెవెన్యూ అధికారులు గుర్తించారు.



ఆరగిద్దలో పాక్షికంగా కూలిన ఇళ్లు

పాత ఇళ్లు కూల్చివేత..

అయిజ: వర్షాలకు పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉండడంతో అధికారులు వాటిని కూలిచ్చివేసే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పాతఇళ్లను కూల్చివేసే కార్యక్రమం మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. కూల్చివేసే పనులను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న పరిశీలించారు. కొంతమంది ఇంటి యజమానులు వారి ఇళ్లను కూల్చివేయకుండా అడ్డుపడడంతో తహసీల్దార్ జ్యోతి సంఘటనా స్థలానికి వచ్చారు. ఇంటి యజమానులతో మాట్లాడారు. ఇళ్లు వాటంతట అవే పడిపోతే ప్రాణనష్టం జరుగుతుందని, నష్ట జరగకముందే కూల్చివేయాలని చెప్పడంతో ఇంటి యజమానులు కూల్చేందుకు అనుమతించారు.

నిర్వాసితులు ఆందోళన చెందొద్దు

గట్టు: చిన్నోనిపల్లె నిర్వాసితులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సరితారాణి తెలిపారు. సోమవారం చిన్నోనిపల్లె గ్రామాన్ని తహసీల్దార్, ఆర్ఐ రాజు సందర్శించారు. గ్రామ సమీపంలోకి వచ్చిన రిజర్వాయర్ నీటిని పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ గ్రామంలోకి వచ్చే అవకాశం లేదని, రిజర్వాయర్‌లోకి వచ్చే నీరు బయటకు పోయే విధంగా కాల్వను తవ్వినట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రామస్తులు సహకరిస్తే పెండింగ్‌లో ఉన్న షిఫ్టింగ్ చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.



కూల్చివేతను పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతి

పిచ్చిమొక్కలు తొలగింపు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో విద్యుత్ తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు, స్తంభాలకు పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయంటూ ఈనెల 1న అల్లుకున్న నిర్లక్ష్యం అంటూ 'సాక్షి' కథనం ప్రచురితమైంది. దీనిపై సోమవారం విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ స్పందించారు. ఈ మేరకు సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు పెరిగిన పొదలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

సాక్షి ఎఫెక్ట్..



గంటవీధిలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు తొలగించిన పిచ్చిమొక్కలు

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

● పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో భక్తులు సోమవారం మండలంలోని ఎక్లాస్ పురంలో శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకీపై ఊరేగించారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకీపై శోభాయాత్ర నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌక్, కొత్తబస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా వెళ్లిన శోభాయాత్ర పెట్రోల్‌బంక్ చౌరస్తా వరకు కొనసాగింది. ఊరేగింపులో మహిళలు కోలాటం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండల కేంద్రంలోని నీలకంటేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి వేదపండితులు పంచామృతాభిషేకం నిర్వహించారు. కాలనీల్లో నందికోళ్ల సేవతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో భజన బృందం స్వామివారి భక్తి గీతాలను ఆలపించారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

చలన చిత్ర దర్శకుడికి సన్మానం

అయిజ: చలన చిత్ర దర్శకుడు శశిధర్‌రెడ్డిని ఆయన అభిమానులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సీతారాం చిత్రాలు దర్శకుడు సోమవారం మండల కేంద్రంలోని మాధవ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి తాను తీసిన సినిమా వీక్షించారు. అనంతరం అభిమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.



శశిధర్‌రెడ్డిని సన్మానించిన అభిమానులు

రైతు కుటుంబ సభ్యుల వివరాల సేకరణ

అయిజ: రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించే కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మండలంలోని సింధనూరు, కుటకనూరు, తొత్తినోనిదొడ్డి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఏఈఓలు రైతుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలు గ్రామాల వారీగా నమోదు చేయడానికి వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యటిస్తారని తెలిపారు. మంగళవారం భూంపురం, ఉత్తనూరు, సంకాపురం గ్రామాల్లో రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు ఎంఏఓ తెలిపారు. కుటుంబ సభ్యుల నమోదు వివరాలతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ధ్రువీకరణ పత్రాలు వ్యవసాయ అధికారులకు సమర్పించాలని ఎంఏఓ కోరారు.



రైతులతో సెల్ఫీ తీసుకుంటున్న మండల వ్యవసాయ అధికారి జనార్దన్

ఘనంగా ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం

గద్వాలన్యూటౌన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఆ సంస్థ ఉద్యోగులు స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ చండీశ్వర్ మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థ ఏర్పడి 67 ఏళ్ల పూర్తి చేసుకొని 68వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. 24 ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల్లో అన్నింటి కన్నా 98.35 శాతంతో ఎల్ఐసీ క్లెయిమ్స్ చెల్లించిందన్నారు. ఆస్తులు రూ.52లక్షల కోట్లు ఉన్నాయన్నారు. ఐసీఈయూ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థ చాలా గొప్పదన్నారు. 98,661 మంది ఉద్యోగులు, 14లక్షల మంది ఏజెంట్లు పని చేస్తున్నారని తెలిపారు. పాలసీల మార్కెట్ షేర్ 69.91 శాతం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓలు బషీర్, దివాకర్, జాన్ ఉద్యోగులు సూరజ్, పద్మావతి, రాఘవేంద్ర, రంగయ్య, శివశంకర్, కృష్ణ చైతన్య, పద్మలతో పాటు ఏజెంట్లు పాల్గొన్నారు.

మండలంలో జెడ్పీ సీఈఓ పర్యటన

ధరూరు: మండలలో జిల్లా పరిషత్ సీఈఓ కాంతమ్మ సుడిగాలి పర్యటన చేశారు. సోమవారం ఆమె ఎంపీడీఓ మంజులతో కలిసి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. గుడ్డెందొడ్డి వద్ద ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం జాంపల్లిలో పాత ఇళ్లను పరిశీలించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముసురు వర్షాలతో పాత ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని, ఈ విషయంలో మండలంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండి, అటువంటి వారి ఇళ్లను ఖాళీ చేయించి ప్రభుత్వ భవనాల్లో ఉండేలా చూడాలన్నారు. అనంతరం వరద ఉధృతికి కొట్టుకుపోయిన నీలహళ్లి– పాతపాలెం గ్రామాల మధ్య ఉన్న తాత్కాలికి రోడ్డును పరిశీలించారు. ఈ మార్గం గుండా తిరిగే వారు ఎలా గమ్య స్థానాలకు చేరకుంటున్నారని ఆరా తీశారు.



గుడ్డెందొడ్డి వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈఓ కాంతమ్మ.

'గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేశా'

గట్టు: చాగదోణ గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా ఏర్పడిన అంతంపల్లికి సర్పంచ్‌గా 2019లో ఆంజనేయగౌడు ఎన్నికయ్యాడు. గ్రామాభివృద్ధి కోసం రూ.32లక్షలు అప్పులు చేశాడు. పదవీకాలం ముగిసినా చేసిన పనులకు బిల్లులు రాలేదు. భూమిని మార్టిగేట్ చేసి అప్పులు తీరుద్దామని పోతే ఇనాం భూమి అని తహసీల్దార్ నిరాకరించాడు. దీంతో చేసేదేమీ లేక భార్య సరస్వతి, కుమారుడు రామకృష్ణగౌడ్‌తో కలిసి ఆందోళన చేశాడు.

డబ్బులు రాకుంటే పంచాయతీకి తాళం వేస్తా

గ్రామాభివృద్ధి కోసం డబ్బులు ఖర్చు చేశానని, బిల్లుల కోసం అధికారుల చుట్టు తిరిగి తిరిగి విసుగు చెందినట్లు మాజీ సర్పంచ్ ఆంజనేయగౌడ్ తెలిపాడు. బిల్లులు చెల్లించకపోతే తాను నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి తాళం వేస్తానని పేర్కొన్నాడు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబంతో మాజీ సర్పంచ్ ఆంజనేయగౌడ్